క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పాత 5వ నంబర్ బస్సు రూట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఐదో నంబర్ రూట్, అశోక్‌నగర్, వెల్లంకి రామ్మోహనరావు రోడ్డు, దాసరి రమణ నగర్, నవోదయ కాలనీ, అమ్మ కల్యాణ మండపం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఆది దంపతులకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై రాజగోపురం ఎదుట కళావేదికపై బుధవారం పలువురు చిన్నారులు తమ కూచిపూడి నృత్యంతో ఆది దంపతులకు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడ ప్రణవం ఆర్ట్స్ అకాడమీకి చెందిన ఎం.ప్రణతి, సీహెచ్ అతులిత, తేరాల వర్షిక, ప్రజ్ఞవి, హిరణ్యలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

వైభవంగా సహస్ర లింగార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారికి విశేష పూజలను నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు నటరాజస్వామి వారి ఆలయం సమీపంలోని వేదిక వద్ద సహస్ర లింగార్చన జరిపారు. ఆలయ అర్చకులు స్వామి వారి సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి విశేషంగా అలంకరించారు. బుధవారం నిర్వహించిన సహస్ర లింగార్చనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం సహస్ర దీపార్చన సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆయా సేవల్లో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో కార్తిక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం కార్తిక మాసం పురస్కరించుకుని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురుస్వామి స్వామివారికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

చికిత్స పొందుతూ హోటల్ కార్మికుడి మృతి



ప్రసాద్ మృతదేహం

పాయకాపురం(విజయవాడరూరల్): పైపుల రోడ్డు వద్ద ఓ క్యాంటీన్‌లో పని చేస్తూ అనారోగ్యం కారణంగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ డి.కె.ప్రసాద్(40) అనే కార్మికుడు మంగళవారం మృతి చెందాడు. నున్న పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాద్ అనే వ్యక్తి ఈ నెల 15న క్యాంటీన్‌లో కార్మికుడిగా పనిలో చేరాడు. అతడు ఆరోగ్యం బాగోనందున చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు నున్న పోలీసులు నాన్ మెడికల్ లీగల్ కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలకు ప్రభుత్వాస్పత్రిలో లేదా నున్న పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

శరవేగంగా నగరాభివృద్ధి

- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- బెంజిసర్కిల్ వద్ద హైవే వెంబడి పార్క్ పనులకు శంకుస్థాపన



పార్క్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న అవినాష్, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ దుర్గ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో నాలుగున్నరేళ్లుగా శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే నగరంలో అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. బెంజిసర్కిల్ నుంచి రమేష్ హాస్పిటల్ వరకు రెండో ఫ్లై ఓవర్ కింద 800 మీటర్లు రూ.2.93 కోట్లతో అభివృద్ధి చేయనున్న పార్క్ నిర్మాణ పనులను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి అవినాష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీనరీ, ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో రూ.వందల కోట్లు వెచ్చించి రోడ్లు, పార్క్‌లు అభివృద్ధి చేయడంతో పాటు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేపట్టామన్నారు. నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా రెండు ఫ్లై ఓవర్లను నిర్మించామని తెలిపారు. కాలనీలు, కొండ ప్రాంతాలు అనే వ్యత్యాసం లేకుండా, నగరం మొత్తం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

గత టీడీపీ ప్రభుత్వంలో ఎంపీ, మేయర్, కార్పొరేటర్లు అందరూ ఆ పార్టీకి చెందిన వారే అయినప్పటికీ అభివృద్ధి చేసింది ఏమీ లేదని అవినాష్ విమర్శించారు. కనీసం ఐదేళ్లలో ఒక ఫ్లై ఓవర్ నిర్మాణం కూడా పూర్తి చేయలేక పోయారని ఎద్దేవా చేశారు. అంతకంటే దౌర్భాగ్యం ఉంటుందా అని ప్రశ్నించారు. తమ అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుని, లేని అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపించి ప్రజలను మభ్యపెట్టారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత శంకుస్థాపనలు చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవాలు చేశామన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, ప్రతిపక్షాలు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలాకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, రెహానా నాహిద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, 8, 9 డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు యలమంచిలి జయప్రకాష్, వల్లూరు ఈశ్వరప్రసాద్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు



సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న అవినాష్, నాయకులు

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. బుధవారం ఆయన 9వ డివిజన్, మోడ్రన్ సూపర్ మార్కెట్ పక్కన రోడ్డులో ఉన్న 65వ సచివాలయంలో పరిధిలో జరిగిన ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ పరిధిలోని 1,248 మందికి రూ.4 కోట్ల 70 లక్షల లబ్ధి చేకూరిందని, దీనికి సంబంధించిన డిస్ ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం సుభిక్షం..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయనడానికి ఈ సచివాలయమే నిదర్శనమన్నారు. స్థానికంగా, పక్కనే ఉన్న చంద్రబాబు నాయుడు కాలనీలో అధిక శాతంలో టీడీపీ అభిమానులు ఉన్నప్పటికీ అర్హతే ప్రామాణికంగా ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో డివిజన్‌కు కేవలం వందలోపే పెన్షన్లు ఇచ్చేవారని, అవి కూడా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి, వారికి లంచాలు ఇచ్చి ఆ పార్టీకే ఓటు వేస్తామని బతిమిలాడితే ఇచ్చేవారని విమర్శించారు. తాము సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రంలో సమూల మార్పులు తీసుకొచ్చాము కాబట్టే ధైర్యంగా నేడు ప్రజల ముంగిటకు వచ్చి చేసిన మంచి చెబుతున్నామని, అదే గత ప్రభుత్వంలో మీరు ఏమి చేశారో చెప్పగలరా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీ అయిన అధికారంలో ఉన్న ఐదేళ్లలో అమలు చేశారా అని నిలదీశారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని లేకపోతే గతంలా 50 ఏళ్లు వెనక్కు వెళుతుందన్నారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో రాబోయే ఎన్నికల్లో 175కి 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని అవినాష్ ధీమా వ్యక్తం చేశారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 9వ డివిజన్ ఇన్‌చార్జి, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు వల్లూరు ఈశ్వర ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గద్దె కళ్యాణ్, మండల అధ్యక్షుడు రిజ్వాన్, నాయకులు సుబ్బరాజు, కాశీ, శ్రీనివాస్, నాగరాజు, కన్నబాబు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు



మురళీకృష్ణను సత్కరిస్తున్న లయోల సిబ్బంది

గుణదల(విజయవాడతూర్పు): ఒత్తిడిని అధిగమించి మెరుగైన ఆరోగ్యం సమకూరాలంటే యోగా, ప్రాణాయామం వంటి ప్రక్రియలు దోహదపడతాయని ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల ఆవరణలో యోగాసనాలపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో వృత్తి, వ్యాపార, ఉద్యోగాల్లో ఉండే ప్రజలంతా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ ఒత్తిడి కారణంగా మానసిక రుగ్మతలతో పాటు శారీరక బలహీనతలు తలెత్తుతున్నాయని చెప్పారు. వీటిని అధిగమించాలంటే యోగా, ప్రాణాయామం వంటి ప్రక్రియలు అవలంబించాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే పెద్దల మాటను పాటించాలని కోరారు. విద్యార్థులు యోగా చేయటం వలన ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. మానసిక ఒత్తిడి దూరమై జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. ఆత్మ విశ్వాసం పెరిగి మంచి ఫలితాలు సాధించగలుగుతారని చెప్పారు. ప్రతి రోజు యోగా చేయటం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో యోగాకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి ఒక్కరూ దీని ఆవశ్యకతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ రాజు, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు శుభ, పూనమ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫైజర్‌పేట పెద్దిరాజు వీధికి చెందిన నాగోతి గాయత్రి, చలపతిరావులు భార్యభర్తలు. వీరికి 20 ఏళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు సంతానం. కొంతకాలంగా గాయత్రిని చలపతిరావుతో పాటు అత్త, మావయ్య, బావ, ఆడపడుచులు వేధింపులకు గురి చేయడమే కాకుండా ఇంటి నుంచి వెళ్లిపోవాలని హింసించసాగారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సహకార కేంద్ర బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: ప్రజలకు సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదపులిపాక సొసైటీ సీఈఓ బి.రఘు అన్నారు. పెదపులిపాక గ్రామంలో కీర్తన కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించిన సందర్భంగా బుధవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు సహకారంతో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బ్యాంకుల్లో పొదుపు ఖాతా ప్రారంభించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రజలు సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్నసేవలు, సౌకర్యాలు పొందాలని సూచించారు. పోరంకి సొసైటీ పరిధిలోనూ కళాజాతా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు మంచినేని పరమేష్, వీపీఏ స్మైలీ, రైతులు పాల్గొన్నారు.

● కపోతాల కనువిందు



నగరంలోని పాత శివాలయం ఆవరణలో పెద్ద సంఖ్యలో పావురాలు కనువిందు చేస్తున్నాయి. ప్రతి రోజు నగర వాసులు పావురాలకు ఆహారం అందిస్తారు. ఈ క్రమంలో బుధవారం పావురాలకు ఆహారం ఇస్తున్న చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కార్మికుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న వెంకట రమణారావు

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని కార్మికుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆటోమొబైల్ అసోసియేషన్(ఏటీఏ) అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు అన్నారు. ఏటీఏ సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ఏటీఏ కార్మికుల పక్షంగా నిలబడి పనిచేస్తోందన్నారు. ఈ అసోసియేషన్‌లో 2,400 మంది సభ్యులు ఉన్నారన్నారు. పాలకవర్గం మరో 50 మందికి పైగా ఉన్నారన్నారు. అసోసియేషన్ ప్రతి ఏడాది కార్మికులకు ఉచితంగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తోందని చెప్పారు. కార్మికుల నైపుణ్యత కోసం వివిధ కంపెనీలతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఆటోనగర్‌లో నిర్మిస్తున్న తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి కావస్తుందని, త్వరలో కార్మికవాడకు తాగునీరు వస్తాయన్నారు. మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఉన్నతాధికారులతో మాట్లాడి అభివృద్ధిలో ముందుకు పోతామన్నారు. కొత్త ఆటోనగర్‌లో అంతర్గత రోడ్డు సమస్యను త్వరలో పరిష్కారం అవుతుందని చెప్పారు. సమావేశంలో అజెండా అంశాలన్నింటిని సభ్యులకు వివరించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు రాజనాల సమాధానం ఇచ్చారు. గత రెండేళ్ల జమా ఖర్చులను కోశాధికారి సయ్యద్ షాసాహెబ్ హుస్సేని చదివి వినిపించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రావి రామచంద్రరావు, అర్జా సత్యన్నారాయణ, గంధం వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హోంగార్డులకు యూనిఫాం అందజేత



గన్నవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డులకు యూనిఫాంను డీఎస్పీ జయసూర్య చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. వారికి మెరుగైన వేతనాలతో పాటు ఉన్నత సదుపాయలను కల్పిస్తున్నామన్నారు. స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డులకు యూనిఫాం పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన సీఐ పి.కనకరావును డీఎస్పీ అభినందించారు. అనంతరం హోంగార్డులతో పాటు గన్నవరం సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సీఐ పి.కనకరావు, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, నాగరాజు, నవీన్, సత్యనారాయణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో వనసమారాధన

విజయవాడరూరల్: నున్న గ్రామం చినకంచిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగులు కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో బుధవారం జరుపుకొన్నారు. తొలుత సంప్రదాయబద్ధంగా ఉసిరిచెట్టు వద్ద దామోదర పూజను భక్తిశ్రద్ధలతో చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వనసమారాధనకు హాజరైన రిటైర్డ్ ఉద్యోగుల దంపతులు తమ పాతజ్ఞాపకాలను నెమరవేసుకొంటూ ఆటపాటలతో సంతోషకరమైన వాతావరణంలో గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో ఇలాంటి వనసమారాధన కార్యక్రమాలను నిర్వహించుకోవడం ద్వారా అనుబంధాలు బలపడతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి నాగరాజు, సిటీ అసోసియేషన్ కార్యదర్శి కేఎస్ హనుమంతరావు, ఉపాధ్యక్షుడు జనార్దన్‌సింగ్, కార్యదర్శి కొల్లి రామచంద్రరావు, కార్యవర్గ సభ్యులు పుల్లయ్య, రామ్మోహనరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ అధికారులతో బుధవారం సమీక్షించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు రద్దీగా ఉన్న పలు ప్రాంతాలను గుర్తించి, ప్రయాణికుల సౌకర్యార్థం ట్రాఫిక్‌ను తగ్గించి ప్రమాదాలకు నివారణగా చర్యలకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రజల శ్రేయస్సు ప్రధానమని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు, సదుపాయాలు, చర్యలు తీసుకోటానికి వీఎంసీ సిద్ధంగా ఉందని అన్నారు. సమావేశంలో ఏడీసీపీ(ట్రాఫిక్) ప్రసాద్, ఏసీపీ(ట్రాఫిక్) వెంకటనారాయణ, ఏసీపీ(సౌత్) రవికిరణ్, ఏసీపీ(సెంట్రల్) భాస్కర్, కృష్ణలంక సీఐ ఎంవీ దుర్గారావు, వీఎంసీ డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(పార్క్స్) ఏఎస్ఎన్‌ప్రసాద్ పాల్గొన్నారు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ విశాల్ గున్ని

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి విజయవాడ కమిషనరేట్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఈస్ట్ జోన్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని, సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసుల బృందం బుధవారం బెంజిసర్కిల్–పటమటలంక తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీసీపీ విశాల్ గున్ని మాట్లాడుతూ విజయవాడ అవుటర్ రింగ్ రోడ్డు పనులు పూర్తయితే నగరంపై కొంత వరకు ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా ఎక్కువగా ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రదేశాలను, రోడ్డు ఆక్రమణలను గుర్తించామని స్వల్ప మార్పులు చేసి ట్రాఫిక్‌ను నిరోధించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించామని తెలిపారు. అధికారులందరితో కలిసి ట్రాఫిక్ సమస్యపై చర్చించి వారి సలహాలను తీసుకుంటామని, ప్రజలు, వాహనదారులు కూడా సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, పబ్లిక్, పోలీస్‌ల ఇద్దరి సహకారంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. అంతకుముందు పరిసర ప్రాంతాలైన ప్రధాన కూడళ్లను, బెంజ్ సర్కిల్, బందర్ రోడ్డు, ఏలూరు రోడ్డు, నేషనల్ హైవేపై సిగ్నల్స్‌లను పరిశీలించి అధికారులకు, సిబ్బంది తగు సూచనలు అందించారు. ఈ పర్యటనలో ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, 2వ ట్రాఫిక్ ఏసీపీ జె.వెంకట నారాయణ, సౌత్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంకల్ప బలం ఉంటే వైకల్యం దూరం



పరికరాల పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

గుణదల(విజయవాడతూర్పు): సంకల్ప బలంతో శారీరక బలహీనతలను, వైకల్యాన్ని అధిగమించవచ్చని ఆంధ్ర లయోల కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి జి.సహాయ భాస్కరన్ అన్నారు. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ కళాశాలలో దివ్యాంగుల కోసం సహాయ పరికరాలు అనే అంశంపై ప్రాజెక్ట్ ఎక్స్‌పోను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. శారీరక బలహీనత ఉన్న విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. దృష్టి లోపాలు, అంధత్వం ఉన్న విద్యార్థుల కోసం ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన పరికరాలు రూపొందించడం అభినందనీయమన్నారు. అంధ విద్యార్థులకు విద్య వ్యవస్థలో ఉపయోగపడే దిశగా నూతన కంప్యూటర్, వాయిస్ మానిటర్, వర్చువల్ మౌస్‌ను ఆవిష్కరించడం హర్షణీయమని కొనియాడారు. ఈ కంప్యూటర్ అసిస్టెంట్ వాయిస్ కమాండ్స్ ద్వారా పని చేస్తుందని తెలిపారు. మాట్‌ల్యాబ్ టెక్నాలజీని ఉపయోగించి విద్యార్థులు ఈ పరికరాన్ని రూపొందించారు. ఇది దృష్టి లోపాలు ఉన్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు ఈ అధునాతన కంప్యూటర్ పనితీరును వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ ఓ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబం నుంచే లింగ సమానత్వం రావాలి



మాట్లాడుతున్న దిశ పోలీస్‌స్టేషన్ సీఐ వాసవి

పటమట(విజయవాడతూర్పు): లింగ సమానత్వం అనేది కుటుంబ వ్యవస్థ నుంచే రావాలని, ప్రతి తల్లి కూడా తమ బిడ్డలను ఆడ మగ అనే తేడా లేకుండా పెంచాలని దిశా పోలీస్‌స్టేషన్ సీఐ వాసవి అన్నారు. స్టెల్లా కాలేజ్‌లో డిగ్రీ విద్యార్థినులకు లింగ సమానత్వం– ఒత్తిడిని జయించటం అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వాసవి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య తేడాలు ఉండకూడదని, దీనిపై ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందని, లింగ నిర్ధారణ చేయటం నేరమని, అలాగే మహిళలు లింగ అసమానత్వం వల్ల హింసను ఎదుర్కొంటే చట్టాల ద్వారా శిక్షలు పడతాయన్నారు. మహిళలు, పిల్లల హక్కులు కాపాడటంలో వారికి భద్రత కల్పించటం రాష్ట్రంలో దిశ పోలీస్ స్టేషన్లు ఎంతగానో కృషి చేసి ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. మహిళలు బాలల హక్కులు పరిరక్షించటంలో యువత భాగస్వాములు కావాలని, ఆపద వచ్చినప్పుడు, 1098 కు లేదా 181కు ఫోన్ చేస్తే వారికి భద్రత కల్పిస్తామని తెలిపారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి..

మానసిక నిపుణురాలు మానస మాట్లాడుతూ అసమతౌల్యపు ఆహార అలవాట్లు, నిద్ర లేకుండా మెల్కోవటం, మొబైల్‌కు అడిక్ట్ అవటం, ఎక్కువ సేపు మేల్కొని ఉండటం, జంక్ ఫుడ్ అధికంగా గా తీసుకోవటం వంటి పలు కారణాల వల్ల గుండె జబ్బులు అధికం అవుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయంటే అందుకు ఒత్తిడి ప్రధాన కారణమని, ఒత్తిడిని ఎదుర్కోవటానికి యోగ, మెడిటేషన్ చేయాలని సమతుల్య ఆహారం తీసుకోవాలని చెప్పారు. సరైన జీవన సరళిని అలవర్చుకోవటం ద్వారా ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బాలల–మహిళల హక్కులు పరిరక్షించటం లో కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ రమేష్, సెక్రటరీ, ప్రకాష్, ఇంటర్మీడియెట్ కో ఆర్డినేటర్ స్వప్న ఉన్నాం, పద్మావతి, శ్రావణ కృష్ణకుమారి పాల్గొన్నారు

ఆయుర్వేద ఆస్పత్రి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కంకిపాడు: ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోలవెన్ను ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పి.నీలిమ అన్నారు. కోలవెన్ను మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శొంఠి మాధవరావు ఆస్పత్రి ప్రాంగణంలో రాశివనం, నక్షత్రవనం, తులసీవనం ఏర్పాటుకు మొక్కలను బుధవారం అందించారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఆస్పత్రి వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.